



'అసలిలాంటి వాళ్ళని నాలుగు తన్ని బుద్ధి చెప్పాలి. వాడికి బుద్ధిలేకపోతే పట్టు చీరకట్టుకుని, నుదుట రూపాయి కాసంత బొట్టు పెట్టుకుని వంటి నిండా బంగారు నగలతో లక్ష్మీదేవిలా ఉన్న ఆ మహా యిల్లాలి కైనా ఉండొద్దూ. వాడేమో అడ్డ దారిలో పడి ముందరికి పోతూ.... అదేదో ఘన విజయంలా ఈవిడకు చెప్పడం... నా మొగుడంత మేధావి యీ ప్రపంచంలోనే లేడన్నట్టు ఈవిడేమో ముసిముసి నవ్వులు నవ్వడం మురిసిపోవడం ఛీ.... ఛీ..... గుడి కొచ్చినా మనఃశ్శాంతి కరువయి పోతోంది ఇలాంటివి చూస్తుంటే' చిరాగ్గా, విసుగ్గా అసహనంగా అన్నాడు అప్పారావు.

దేవుడి మీది భక్తితో ఉదయం పదవుతున్నా కనీసం టిఫిన్ కూడా చెయ్యకుండా, స్థూలకాయ మైనా లెక్కచెయ్యకుండా అన్నీ మెట్లు కాలి నడకన ఎక్కి, పాతిక రూపాయలిచ్చి శీఘ్ర దర్శనం చేసుకోందాం అంటే అబ్బే వద్దు వాతావరణం బావుంది, నలుగురం కలిసాం..... హాయిగా దేవ సన్నిధిలో కాసేపు శాంతిగా గడుపుదాం అంత శీఘ్ర దర్శనాలు చేసి పరిగెత్తడానికి అవతల మనం చేసే ఘన కార్యం ఏముంద కనక ఆదివారమే కదా అన్న అప్పారావు కంట్లో ఆదృశ్యం పడటం అతనికి అసహానం, చిరాకు విసుగు ఏమొచ్చినా మనం తప్పుపట్టలేం.

నిజానికి ఆ సంఘటన అందరిని కదిలించింది. అందరికి అంతో యింతో అసహనం.... చిరాకు.... కోపం..... లాంటివి కల్గించిన మాట నిజం.

'అప్పారావు గారూ.... అతను డబ్బు ఎరచూపి అడ్డ దారిలో వెళ్ళాడని అతని మీద కోపం తెచ్చుకుని విరుచుకు పడతారెందుకు? నన్నడిగితే అతనిదేం తప్పులేదు. ఆ గేటు దగ్గర ఉన్నాడే ఈ ఆలయానికి సంభందించిన ఉద్యోగి. వాడు.... వాడిది తప్పు. విశ్వాసఘాతకుడు. దేవస్థానం అతనికి ఉద్యోగం యిచ్చి అతనికో పవిత్రమైన భాద్యత అప్పజెప్పింది. అది అతను సక్రమంగా నిర్వర్తించాలి. అతను దాన్ని నిర్వర్తించక అవకాశం కల్పిస్తే ఎదుటి వాడిదేముంది. అవకాశం దొరికింది కదా అని వినియోగించుకున్నాడు. దేవస్థానం నిర్ణయించిన రూ 25/- టిక్కెట్టు లేకుండా వాడు వదలనంటే వీడు వెళ్ళగలడా? అదీ కాక వీడు ఫ్యామిలీతో పాటు ధైర్యంగా వచ్చి రూ 30/- చేతిలో పెట్టి వెళ్ళగలిగాడు అంటే ఇది ఈ రోజు భాగోతం కాదు. అతనికి తెలిసినదే రోజు జరుగుతున్నదే. తప్పు ఆ దేవస్థానం ఉద్యోగిదనే నేనంటాను తన ధోరణిలో నిదానంగా చిన్న నవ్వు నవ్వుతూ అన్నాడు నాయుడు. నాయుడులోని ప్రత్యేకతే ఇది. విషయం ఎంత సీరియస్ అయినా... ఎలాంటి టెన్షన్.... ఏంగ్జయిటీ లేకుండా నిదానంగా, నిబ్బరంగా ఏ ఆవేశానికి లోను కాకుండా నవ్వుతూ మాట్లాడతాడు. నాయుడుకు పూర్తిగా భిన్నం మా అప్పారావుగారు. కోపం వచ్చిందంటే ముఖంలో రంగులు మారిపోతాయ్. అంతోటి భారీ పర్సనాలిటీ కోపంతో ఊగిపోతూ మాట్లాడ్డం మొదలు పెట్టేసరికి ఎదుటివాడికి కొంచెం భయం కల్గడం సహజం. ఫ్రెండ్స్‌గా అతని స్వభావానికి అలవాటు పడ్డ మాకు తప్ప. 'బలే చెప్పారండి. ఆ ముప్పయి రూపాయిలు యిచ్చి వెళ్ళిన వాడ్ని చూసారా? అతని చేతికున్న పది వేళ్ళకు పదహారు ఉంగరాలు ధరించాడు. లక్ష్మీపుత్రుడు అలాంటి వాడు న్యాయం - అన్యాయం అన్న ఆలోచన లేకుండా అడ్డ దారితొక్కితే ఆప్టరాల్ ఓ దేవస్థానం ఉద్యోగి ఓ పది రూపాయిలకు కక్కుర్తి పడితే అది పెద్దలంచం విశ్వాసఘాతుకమనా? పోనీ ఒకప్పుడు వీడు ఎం మడిగట్టుకుని సిన్సియర్‌గా వాడ్ని అడ్డగించినా, అడ్డు పెట్టినా వాడి డబ్బు, హోదా వీడ్ని బతకనిస్తాయా? ఎన్ని అడ్డ దార్లు తొక్కి సంపాయించాడో ఆ ఉంగరాలు వెధవ.... సంపాదించడా దేవుడి క్యూలోనే రూ 20/- మిగుల్చుకున్న మేధావి...' కోపంతో అన్నాడు అప్పారావు.

అప్పుడందుకున్నాడు రంగనాధం. మా రంగనాధానికి మంచి వాక్చాతుర్యం ఉంది. పది మంది ఒక విషయంలో ఏకాభిప్రాయానికి వచ్చినా..... ఏదో ఓ చిన్న సందు చూసి వాళ్ళ అభిప్రాయం తప్పని వాధించగలడు.... నిజమే మనది తప్పేమో! రంగనాధం మాటల్లో నిజం ఉందేమో అన్న భ్రమలో ఈ పదిమందినీ పడెయ్యనూ గలడు. రంగనాధం మొదలెట్టాడు. 'నాకడిగితే అసలు మీ రిద్దరూ తప్పు దార్లోనే ఆలోచిస్తున్నారు. రూ 50/- యివ్వాల్సిన టిక్కెట్లకు రూ 30/- యిచ్చి ఒక్క క్షణంలో రూ 20/- మిగుల్చుకున్న వీడిదీ కాదు. ఆ ఇరవై జేబులో కుక్కేసుకుని వీడ్ని వదిలేసిన వాడిదీ కాదు.... అంటూ ఆగాడు. ఇలా శ్రోతల్ని తికమకలో పడేసి తను చెప్పబోయే విషయాన్ని గూర్చి శ్రోతల్లో ఉత్కంఠను పెంచే టెక్నిక్ అతనిలో ఉంది.

'బావుంది.... ఇంకెవరిదట తప్పు? ఈ ఘోరం కళ్ళారా చూసిన మాదా?' కోపంగా అడిగాడు అప్పారావు - నాది అదే మాట అన్నట్టు కళ్ళతోనే చెబుతూ నిదానంగా నవ్వాడు నాయుడు.

'కోపం తెచ్చుకోకయ్యా బాబూ! చెబుతాను గదా తప్పెవరిదంటే అదుగో యిందర్నీ తన ముందుకు రప్పించుకుని ముప్ప తిప్పలు పెడుతున్న ఆ దేవుడిది?'

ఒక్కసారిగా అందరం ఆశ్చర్యంలో మునిగి తేలి..... తర్వాత తేలిగ్గా నవ్వేశాం. రంగనాధం మాటలకు. కాని రంగనాధం ఇది ఆషామాషీగా అనేసి వదల్లేదు దీనికి కంటిన్యువేషన్‌గా

'అవును దేవుడిదే తప్పు. తనకళ్ళ ముందే ఇంత అన్యాయం జరుగుతుంటే.... తన మీద భక్తి.... తనకు సేవ చేస్తున్నా మంటున్న వాళ్ళే యింత ఘోరంగా వంచిస్తుంటే కదలక మెదలక ఎందుకు ఊరుకోవాలి? లంచం యిచ్చేవాడి చెయ్యి - పుచ్చుకున్న వెంటనే వీడి చెయ్యి..... జబ్బు బడేట్టు చేస్తే మళ్ళీ అలాంటి ధైర్యంతో ఎవడైనా చెయ్యగలడా?

'మీ ఆవేశం హర్షించ దగ్గదే..... కాని మనిషి చేసిన ప్రతి తప్పుకు దేవుడు శిక్ష విధించుకుపోతే.... కుదరదు.... దేనికైనా పాపం పండాలి' అన్నాడు నాయుడు.

'అంటే అడ్డదారిలో పడి ఎన్ని కోట్లు సంపాదించాలి? ఎన్ని మానభంగాలు చెయ్యాలి? ఎందరి ఉసురు పోసుకోవాలి? ఎన్ని సంసారాలు నాశనం కావాలి? ఎప్పుడండి పండుతుంది పాపం. ఇదంతా ఓ ఫలాయిన మంత్రం మాత్రమే.'

'రంగనాధంగారూ మీరలా అడ్డంగా మాట్లాడితే మేం చెప్పేదేం లేదు. దేవుడు మనిషికి బుద్దినిచ్చాడు. న్యాయం ఏదో.... అన్యాయం ఏదో తెలుసుకునే విచక్షణాజ్ఞానం యిచ్చాడు. మనిషి దాన్ని వక్రమార్గంలో వినియోగిస్తుంటే....

'ఇవన్నీ ఎందుకిచ్చాడంటారు?'

'మనిషి సక్రమంగా నడవటానికి....'

'మరి నడవటం లేదే.....?'

'అది మనిషి తప్పు'

'మరి తప్పు చేస్తుంటే.... తన ఆదేశాల్నే ధిక్కరిస్తుంటే చూస్తూ ఊరుకోవడం దేవుడి తప్పు కాదా?'

'చూస్తూ ఊరుకోవడం ఏమిటి? శిక్షిస్తాడు తప్పకుండా?'

'ఎప్పుడు?'

'పాపం పరిపక్వం కావాలిగా....'

'కాదు.... ఇది మనం తెలియని విషయాన్ని చాక చక్యంగా ప్రక్కదారి పట్టించడం. మన పిల్లలే తప్పు దారి పడితే మనం వాళ్ళని మందలించడం లేదా? సరయిన సమయంలో తగు శిక్ష విధించి వాళ్ళను దండించడం లేదా? మరి దేవుడెందుకిలా ఇన్ని ఘోరాలు జరుగుతున్నా కిమ్మనకుండా ఊరుకుంటున్నాడు. ఇవన్నీ పరికిస్తుంటే అసలు నాకు దేవుని ఉనికి మీదే అపనమ్మకం ఏర్పడుతోంది.'

'దేవుడి లీలలు మనకు అర్థం కావు. సమయం వచ్చినప్పుడు పాపం పండినప్పుడు దేవుడు తప్పక శిక్షలూ విధిస్తాడు.'

'హు.... ఇలాగే మనం మనసుల్ని మభ్య పెట్టుకుని బ్రతికేస్తున్నాం. ఇప్పుడు జరిగిన తప్పుకు ఎప్పుడో శిక్ష పడటం ఏమిటి? పదేళ్ళు పోయాక ఆ ఉంగరాల వాడికి ఏదో జరిగిందే అనుకుందాం అసలది దేవుడు వేసిన శిక్షే అని ఋజువేమిటి? అది ఏ ఎకవుంట్లో పడ్డ శిక్షో..... ఇటు వీడికి అటు లోకానికి అర్ధం కానపుడు ఆ శిక్ష వలన ప్రయోజనం ఏమిటి? ప్రకృతిలో చూడండి. మనం చేసే పనికి వెంటనే రియాక్షన్ ఉంటుంది. ఉదాహరణకు అగ్గిలో చెయ్యి పెట్టావనుకో



కాలుతుంది. ముళ్ళలో నడిచావనుకో గుచ్చుకుని భాధిస్తాయ్ - మామిడి పండు తింటే తియ్యగా మధురంగా వుంటుంది. అదే వేప పండు తింటే చేదు. ఇలా మనిషి ఏం చెయ్యాలో ఏం చెయ్యకూడదో... దీని ఫలితం ఏమిటో వెంటనే తెలియజేస్తుంది ప్రకృతి. అందుకే మనిషి కావాలని అగ్నిలో చెయ్యి పెడతాడా? వేప పండు తింటాడా? తింటే జరిగేదేమిట్రో తెలుసుకనక తినడు. మరి అలాగే మనిషి చేసే చెడుపనికి శిక్ష వెంటనే దేవుడు విధిస్తే మనిషి వెంటనే చెడు పని చెయ్యడం మానెయ్యడా?' రంగనాథం తన ఆర్గుమెంటును నిరాటంకంగా సాగిస్తున్నాడు. మా వాళ్ళెవరికీ ఆ వాదన నచ్చడం లేదన్నది వాళ్ళ ముఖాల్లో స్పష్టంగా కన్పిస్తోంది. దైవ దర్శనానికి వచ్చి దైవం అస్థిత్వం మీదనే అనుమానం రేగడం అందరికీ యిబ్బందిగానే ఉంది. కాని రంగనాథానికి అలాంటి పట్టింపులేం ఉండవు. మనసు లోకి వచ్చిన మాటను నిర్భయంగా చెబుతాడు. అదే అతనిలోని స్పెషాలిటీ.

'ఏమిటండీ రచయితగారూ మీరలా ఉలుకు పలుకులేకుండా వింటున్నారు. మీరిప్పుడైనా కల్పించుకోకపోతే యింక ఈయన్న కంట్రోల్ చెయ్యలేం.' అంటూ నాకు సమాధానం చెప్పమ న్నట్లుగా అడిగారు నాయుడు, అప్పారావు.

'మీ రచయిత దగ్గర మాత్రం ఏం సమాధానం ఉంటుంది. మహా అయితే ఓ చిరునవ్వు తప్ప' అన్నాడు రంగనాథం.

'రావుగారూ! లాభంలేదండీ మీరు కల్పించుకోవాలి. ఇది మామూలు సమస్య కాదు. దైవం అస్థిత్వం మీదనే సవాలు..... మీరు కల్పించుకోవాలి.'

'తప్పకుండా.... దర్శనం దగ్గర పడింది. దైవ దర్శనం అయ్యాక తీరిగ్గా మాట్లాడుకుందాం. ఏ అడ్డదారి తొక్కకుండా వచ్చినందుకేమో రెండు గంటలు క్యూలో నిల్చున్నా శ్రమ తెలియకుండా వుండేట్టు అనుగ్రహించాడాదేవుడు.... ఈ డిస్కషన్.... అన్నాను నేను నవ్వుతూ రంగనాథం వైపు చూసి.

రంగనాథం ఏదో అనబోయాడు. ఈలోగా దర్శించుకునే దేవుడి ముందరగా కావడంతో ఊరుకుండిపోయాడు. దైవ దర్శనం అయింది. ప్రసాదాలు తీసుకున్నాం. చల్లగా నీడ నిచ్చే ఓ చెట్టును సెలక్టు చేసుకుని దాని క్రిందున్న పెద్దరాతి మీద కూర్చుని ప్రసాదాలు స్వీకరించడం మొదలెట్టాం. చల్లని గాలి కల్పించని దైవత్వంలా తాకుతూ సీద తీరుస్తోంది. చెట్టు నుండి రాలి పడుతున్న పచ్చని పూలు నల్లటి బండరాతి మీద పడి దూరం నుంచి చూసేవారికి నల్లని తివాసీ మీద బంగారపు పూసలు వెదజల్లినట్లుగా భ్రమింప జేస్తున్నాయ్. గుడిలో గంటలు శబ్దం. గోవిందా! గోవిందా అన్న భక్తుల సంకీర్తన. తమ భాషలో



తము కూడా గోవిందనామాన్ని స్మరిస్తున్నాయా అన్నట్లు పక్షుల కిలాకిలా రావాలు. దైవానికి చేరు వయితే దాని ముందు ఈ ప్రపంచం చాలా చిన్నది అన్నట్లుగా అగ్గి పెట్టెల్లా కన్పిస్తున్న మల్టీ స్టోరీడ్ బిల్డింగ్స్, చీమల్లా కదులుతున్న బస్సులు ప్రకృతి పరిశీలనలో పడిన నాకు రంగనాధం స్వరం విన్పించింది.

'ఏం కవిగారూ! ఇంతకు ముందు ఏదో చెబుతానన్నారు'

'చెబుతాను రంగనాధం గారూ! చెబుతాను. మనిషి చేసే ప్రతి తప్పుకు దేవుడు శిక్ష విధిస్తున్నాడు మీరు ప్రకృతిని ఎలా నమ్ముతున్నారో దేవుడ్ని అలాగే నమ్మండి. ఆల్మోస్ట్ దేవుడికి ప్రకృతికి తేడా లేదు. దేవుడు కూడా.... సారీ.... ప్రకృతి కూడా దేవుడిలో ఓ అంతర్భాగమే.'

'కవిగారూ! మాకు ఉపన్యాసాలొద్దు.... సమాధానాలు కావాలి.'

'చెబుతాను. కంగారొద్దు. ఇక్కడకు మన అందరం వచ్చింది దేవుడున్నాడు అనే నమ్మకంతో. అదే నిజమైతే ఆ సాన్నిధ్యంలో మనం ఎంతసేపు ఎక్కువ గడపగలిగితే అంత అదృష్టవంతులం మనం షుమారుగా 3 - 4 గంటల కాలం గడిపాం దైవసాన్నిధ్యంలో కాని ఆ ఉంగరాలవాడు అరగంట కూడా గడపకుండా ముప్పై రూపాయలు వదుల్చుకుని మనందరి చేత మాటలు పడి (మనసులో అనుకోండి) వెళ్ళిపోయాడు వాడికీ శిక్ష చాలదంటారా?'

అప్పారావు, నాయుడు నవ్వుతూ చప్పట్లు కొట్టారు. రంగనాధం కూడా వాళ్ళతో పాటు చప్పట్లు కొడుతూ 'ఇది మీ సమాధానానికి తృప్తి పడికాదు. రచయితల మాటలగారడీకి.'


'చూడండి రంగనాధంగారూ! మీరు చేస్తున్న పనిలోనే పొంతన కన్పించడం లేదు. మీరడుగు తున్న ప్రశ్నలను బట్టి దేవుడున్నాడా? లేడా? అనే సంశయంలో మీరు కొట్టు మిట్టాడుతున్నట్టు స్పష్ట మవుతుంది. కాని మీరు భక్తిగా టిఫిన్ మాని కొండె క్కారు కాలి నడకన. పూలు పల్లు కొబ్బరి కాయతో సహా వచ్చి దైవ దర్శనానికి క్యూలో నిల్చున్నారు. చదువు, విజ్ఞానం, విచక్షణ ఉన్న మీలాంటి వారే యిలా సందిగ్ధంలో పడి కొట్టుకుంటుంటే ఇక సామాన్యులు మాటేమిటి? మనం ఏదైనా పని చేస్తున్నప్పుడు ఆ పని మీద మనకు పూర్తి అవ గాహన ఉండాలి. అప్పుడు గాని మనం చేస్తున్న పని మీద మనసు లగ్నం కాదు. శ్రద్ధ కుదరదు. ప్రస్తు తం దేవుడి విషయంలో కూడా ఈ అవగాహనా లోపమే మనల్ని ఊగిసలాట పడేసి శ్రద్ధను లోపింప జేస్తుంది.

దేవుడు దయామయుడు అన్నదే మన నమ్మక మయినప్పుడు తెలిసో తెలియకో తన బిడ్డలు చేసే తప్పులకు దేవుడెలా క్రూరంగా శిక్షించగలడు. పైవాడు తప్పు చేస్తే దేవుడు శిక్షించడేం అని అడుగుతారు అదే స్వయంగా మనం చేస్తే క్షమించు తండ్రీ అని వేడుకుంటాం యీ తేడాలు మనలో ఎందుకు?

దేవుడు మనిషి చేసే ప్రతి తప్పుకు శిక్ష విధించే దండనాయకుడే అయితే.... అసలు ప్రజలకు బుద్ధినిచ్చే పరమాత్ముడే అతడయినప్పుడు ఈ పాపాలు అకృత్యాలు చేసే నీచ గుణాల్ని మనుషుల మనసులు నుంచి తొలగించలేడా? పాపాలు చేసిన తర్వాత దండించే బదులు. రంగనాధం గారూ మనుషుల్లో ఉన్న వివిధ వర్గాలు దైవాన్ని దైహత్యాన్ని

## 'అసంతృప్తి'

ప్రపంచసుందరి ప్రియాంకచోప్రాకి ఆనవాయితీగా సినిమాల్లో నటించే అవకాశం వచ్చేసింది. గోవిందా, బాబీడియోల్, అనిల్‌కపూర్‌లతో నటించేందుకుగాను సైన్ చేసింది. అయితే ఆశించిన విధంగా పెద్ద హీరోలూ, పెద్ద డైరెక్టర్లతో భారీ పారితోషికం తీసుకొనే అవకాశం మాత్రం రాలేదు. అదే ఆమెలో అసంతృప్తికి కారణం. ప్రపంచ సుందరి అయినంత మాత్రాన ప్రపంచ నటి కావలసిన అవసరం లేదు కదా.



తెలుసుకునేందుకు..... అనుసరించేందుకు మన పెద్దలు చేసిన ప్రయత్నాలు యీ పురాణాలు కథలు... సామాన్య ప్రజ సైతం భక్తి శ్రద్ధ కలిగి మంచి మార్గాన్ని నడవాలన్న ప్రయత్నమే యిదంతా కాని విజ్ఞా పరిణితి చెందిన విజ్ఞానులు కూడా మరీ తక్కువగా ఆలోచిస్తున్నారు ఈ విషయంలో అసలు అంతరార్థం గ్రహించకుండా పొరపాటు పడుతున్నారు.

దేవుడంటే ఓ వ్యాపార సంస్థకాదు. మనం చేసే పూజ..... చూపించే భక్తి పెట్టుబడులనుకుని లాభ నష్టాల బేరీజు వేసుకోవడానికి. దేవుడంటే ఓ శక్తి. అది మీలోనే దాగి ఉన్న దాన్ని సక్రమంగా వినియోగించుకోవడం తెలిసిననాడు ఈ ప్రాపంచిక సౌఖ్యాల పట్ల మీకు మోజు ఉండదు. అలౌకికమైన ఆనందం మీస్వంతమవుతుంది. మీ పరిసరాల్ని శుభ్రం చేసుకుని జీవనం సాగిస్తే అది ఎంత చిన్న పూరె గుడిసె అయినా మీకు ఆనందం ఆరోగ్యం స్వంతమవుతుంది. అదే పరిసరాల పరిశుభ్రత పాటించని నాడు ఏడంతస్తుల మేడలోనైనా మీకు ఆనందం ఆరోగ్యం రెండూ కరువే.

ప్రాపంచికమైన డబ్బు కార్లు హోదాలో మీరు ఆనందం ఉందని నమ్ముతున్నారా? కళ్ళకు కన్పించే ఈ ప్రాపంచిక సౌఖ్యాలన్నీ ఉన్న వారి జీవితాల్లోని చీకటి కోణాలు మీకు తెలియనివి కావు. వారనుభవించే నరక యాతన మీకు తెలుసు - నిత్య సంతోషులై నిర్మలంగా వెలుగొందే సర్వసంగ పరిత్యాగులు పొందుతున్న అలౌకిక ఆనందం గూర్చి మీకు తెలుసు.

అన్నీ మనకు తెలిసినా మాయలో మునిగిపోయి చిన్న పిల్లాడిలా ప్రశ్నలు వేస్తాం అప్పుడప్పుడు? ఇంతవరకు క్యూలో భక్తి చెదరని మీకు ప్రక్కవాడు కాస్త ముందు వెళ్ళాడు అన్నంతలో మొత్తం భక్తి భావమే అస్తవ్యస్తమైపోయింది. భగవంతుని ఉనికినే అనుమానించే స్థితికి చేరింది మనసు. కాని వాడికి భక్తంటే అవగాహన లేదని, దేవుడి ఎదుట కూడా అడ్డదారి త్రొక్కడంలో అసలు పూజ భక్తి అన్నదానికి అర్థం మరిచి తను చరించానని తెలుసుకోలేని అజ్ఞాని అని మీకు జాలి కలగలేదు.

మనం ఎవర్నైనా ప్రసన్నం చేసుకోవాలనుకున్నా ఎవరి అనుగ్రహం పొందాలనుకున్నా వారికి నచ్చే పనులు చేస్తాం వారికిష్టం లేని విషయం కనీసం వాళ్ళముందు మాట్లాడటానికి కూడా యిష్టపడం కారణం ఏమిటి? వాళ్ళ ప్రసన్నత, అనుగ్రహం మనకు దూరమవుతుందనే కదా! మరలాంటప్పుడు దైవం ఎదుటే నియమ నిభందనలు అతిక్రమించి, అక్రమ మార్గాలు ఎంచుకున్నవాడికి అనుగ్రహం ఎలా లభిస్తుంది? మీకు దైవం మీద సరయిన నమ్మకం ఉంటే ఖచ్చితంగా మీ ప్రశ్నలన్నిటికీ మీరే సమాధానం చెప్పుకోగలరు. చెప్పుకోవడం ఏమిటి అసలు ఆ ప్రశ్నలే ఉద్భవించవు..... మీ ఊగిసలాటను వదిలి సరయిన అవగాహనకు రండి. మీ సంశయాలు తొలిగి పోతాయ్. యీ సమాధానాలు మీకూ తెలుసు.

నా మాటల ప్రభావం అందరి మీదా బాగా పడిందనడానికి నిదర్శనంగా అందరి ముఖాలు సీరియస్‌గా మారాయ్. అందరూ ఆలోచనలో పడ్డారు రంగనాధంతోసహా. ❀